13న ఇంటర్వ్యూ

మంచిర్యాల ఏసీసీ, జూన్ 11: జాతీయ ఆరోగ్య మిషన్ కింద జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలోని ఎన్‌హెచ్‌ఎం, సిబ్బంది ఒప్పంద, పొరుగు సేవల పద్ధతిన పోస్టుల సంబంధిత మెరిట్, ఎంపిక జాబితాను (డీడీఎం, రిఫ్రిజిరేటర్ మెకానిక్, సీనియర్ డాట్స్ ప్లస్ టీబీ, హెచ్‌ఐవీ, ఎస్‌టీఎల్‌ఎస్, సహాయ సిబ్బంది, జిల్లా అకౌంట్ అధికారి, జిల్లా ప్రోగ్రామ్ సమన్వయకర్త) జిల్లా వైద్య అధికారి కార్యాలయంతో పాటు మంచిర్యాల జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచడం జరిగిందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 13వ తేదీ ఉదయం 10.30 గంటలకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని పేర్కొన్నారు.

28న ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం

రెబ్బెన, జూన్ 11: రామకృష్ణపూర్ సింగరేణి ఏరియా దవాఖానలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులచే ఈ నెల 28వ తేదీన ఉచిత రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించినున్నట్లు బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. 45 సంవత్సరాలు పైబడిన మహిళ ఉద్యోగులు, 45 ఏళ్లు పై బడిన ఉద్యోగి కుటుంబంలోని మహిళలకు నిర్ధారణ పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు.

టీబీజీకేఎస్ డిమాండ్ మేరకు వయస్సు పెంపు

రెబ్బెన, జూన్ 11: సింగరేణి కార్మికుల డిపెండెంట్‌లకు ఉద్యోగం ఇచ్చే వయో పరిమితి 35 నుంచి 40 సంవత్సరాలకు పెంపుదల చేయడం హర్షించదగిన విషయమని బెల్లంపల్లి ఏరియా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీబీజీకేఎస్ యూనియన్ గుర్తింపు కార్మిక సంఘంగా ఉన్నప్పుడు చేసిన డిమాండ్ మేరకు నేడు సింగరేణి యాజమాన్యం 35 నుంచి 40 సంవత్సరాలకు పెంచుతూ 2018 నుంచి వర్తించే విధంగా ఉత్తర్వులను విడుదల చేయడం జరిగిందన్నారు.

కార్మికులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి

శ్రీరాంపూర్, జూన్ 11: హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న కార్మికులకు ఈపీ ఆపరేటర్స్, మోటార్ డ్రైవర్ నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ముందుగా యాజమాన్యం ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ నెల 18 నుంచి 21 వరకు సింగరేణి వ్యాప్తంగా ఈపీ ఆపరేటర్ (క్యాట్‌ఎక్స్) డ్రైవర్ నియామకాల పరీక్షలకు 1705 మంది ఇంటర్నల్ ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. 60 పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఈ నెల 30వ తేదీన రాత పరీక్ష కూడా నిర్వహిస్తున్నారని చెప్పారు. ఉద్యోగాల కోసం ధరఖాస్తు చేసుకున్న వారికి యాజమాన్యం స్థానికంగా లారీ టిప్పర్ ద్వారా శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే వీటీసీల ద్వారా ప్రత్యేక కోచింగ్ ఇవ్వాలని కోరారు. ఈ మేరకు సింగరేణి యాజమాన్యానికి తమ యూనియన్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రెబ్బెన, జూన్ 11: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి ఫిల్టర్ బెడ్, బోర్‌వెల్ సమస్యలు పరిష్కరించాలని బెల్లంపల్లి ఏరియా సివిల్ డిపార్టుమెంట్ ఎస్ఈ భాషాకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందించినట్లు ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి జగ్గయ్య, సివిల్ డిపార్టుమెంట్ గోలేటి ఫిట్ కార్యదర్శి గడ్డం రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నాడెం రవి, రాచర్ల రమేశ్ ఉన్నారు.

ఉద్యోగ నియామక వయసు పెంపు

- శ్రీరాంపూర్ గనులపై ఏఐటీయూసీ నాయకుల సంబురాలు



శ్రీరాంపూర్ ఆర్కే-5 గనిపై మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్, జూన్ 11 : ఏఐటీయూసీ కృషి ఫలితంగానే డిపెండెంట్, కారుణ్య ఉద్యోగ నియామకాల వయసు పెంచుతూ యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసినట్లు ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, బ్రాంచి క్యాదర్శి ఎస్‌కే బాజీసైదా తెలిపారు. మంగళవారం శ్రీరాంపూర్ గనులపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఆర్కే-5 గనిపై నిర్వహించిన సంబురాల్లో వారు పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో తమ యూనియన్ ఇచ్చిన హామీ మేరకు యాజమాన్యం 35 నుంచి 40 సంవత్సరాలకు వయసు పెంచిందన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, యూనియన్ అధ్యక్షుడు సీతారామయ్య ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఉద్యోగ నియామక వయసు పెంపునకు కృషి చేశారన్నారు. కార్మికుల సొంతింటి కళ నెరవేర్చడానికి, అలవెన్స్‌లపై ఐటీ మినహాయింపునకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి నర్సింగారావు, కార్యదర్శి ప్రసాదరెడ్డి, రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు శంకర్‌రావు, విజయ, విశ్వనాథ్‌రెడ్డి, రాజయ్య, సంపత్, శ్రీకాంత్, సంజీవరెడ్డి, మధు, రమేశ్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

మందమర్రి కేకేవోసీ కార్మికులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ

మందమర్రి, జూన్ 11: కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ సంఘం కృషి చేస్తున్నదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ అన్నారు. సింగరేణి మందమర్రి ఏరియాలోని కేకేఓసీపై మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఎప్పటికప్పుడు కార్మికులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం కేకేఓసీ ఈపీ ఆపరేటర్లతో మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు భీమనాథుని సుదర్శన్, సోమిశెట్టి రాజేశం, గాండ్ల సంపత్, ఫిట్ కార్యదర్శులు రాజేశ్ యాదవ్, గోమాస తిరుపతి, ముద్దసాని కోటయ్య, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి గోపతి సత్యనారాయణ, నాయకులు జెట్టి మల్లయ్య, ప్రభాకర్, బానయ్య ఉన్నారు.

ఆర్డీవో దృష్టికి సమస్య

రెబ్బెన, జూన్ 11: ఆసిఫాబాద్ డివిజన్ ఆర్డీవో లోకేశ్వర్‌కు మంగళవారం మండలంలోని నక్కలగూడ గ్రామంలోని ఆదివాసుల పిల్లలకు సంబంధించిన బర్త్ సర్టిఫికెట్ల సమస్యను తీసుకెళ్లినట్లు రెబ్బెన జడ్పీటీసీ వేముర్ల సంతోష్ పేర్కొన్నారు. నక్కలగూడ గ్రామానికి చెందిన 35 మంది ఆదివాసీ పిల్లలకు బర్త్ సర్టిఫికెట్లు లేకపోవడంతో ఆధార్‌కార్డు పొందలేక పోతున్నారని అన్నారు. 15 రోజుల్లో సమస్య పరిష్కరమయ్యే విధంగా ఆర్డీవో చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.

ఆర్గనైజేషన్ ప్యాటర్న్ సవరించాలని వినతి

శ్రీరాంపూర్, జూన్ 11 : సింగరేణిలో పెరుగుతున్న ఉత్పత్తి అవసరాల దృష్ట్యా 2011లో రూపొందించిన అధికారుల ఆర్గనైజేషన్ ప్యాటర్న్ (విధానం)ను సరిచేయాలని కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సింగరేణి విభాగం అధికారులు మంగళవారం అన్నిచోట్ల జీఎంలకు వినతి పత్రాలు అందించారు. శ్రీరాంపూర్ ఏరియా సీఎంవోఏఐ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి అమర్నాథ్ ఆధ్వర్యంలో గనులు, డిపార్ట్‌మెంట్‌లపై అధికారులు మేనేజర్లకు వినతి పత్రాలు అందించారు. శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం పురుషోత్తంరెడ్డికి అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ 100 మిలియన్ టన్నుల దిశగా ప్రయాణిస్తున్న దశలో మైనింగ్ అధికారుల ఆందోళనను గమనించి ఇప్పటి వరకున్న సర్వీస్ డిపార్ట్‌మెంట్ వారికి కొనసాగిస్తున్న 38 మైనింగ్ జీఎం పోస్టులను కొనసాగించాలని కోరారు.

గనులపై ఐఎన్‌టీయూసీ సంబురాలు

మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు

శ్రీరాంపూర్, జూన్ 11 : సింగరేణి కార్మికుల డిపెండెంట్ ఉద్యోగ నియామక వయసు పెంపునకు కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా తమ యూనియన్ ప్రధాన కార్యదర్శి జనక్‌ప్రసాద్ కృషి చేశారని ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ ఆర్కే 6గనిపై కారుణ్య, డిపెండెంట్ నియామక వయసు 35 నుంచి 40 సంవత్సరాలకు పెంపుపై పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. కార్మికులకు మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యాంకుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగె స్వామి, కార్యదర్శి వెంగళ కుమారస్వామి, జీవన్‌రెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

అర్చకులకు రిటైర్మెంట్ గ్రాట్యూటీ చెల్లింపు

దండేపల్లి, జూన్11 : దండేపల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో మనవాల సత్యనారాయణ స్వామి అనే అర్చకుడు 29 సంవత్సరాలుగా ఆలయంలో పని చేశారు. ఫిబ్రవరి 29న రిటైర్మెంట్ అయ్యారు. ఆలయంలో ఈవో సంకటాల శ్రీనివాస్ కమిషనర్ దేవాదాయ, ధర్మదాయ శాఖ ఉత్తర్వుల ప్రకారం రిటైర్మెంట్ గ్రాట్యూటీ రూ.2లక్షలు మంగళవారం చెక్కు ద్వారా అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అర్చకులు గోవర్ధన రఘుస్వామి, అర్చకులు జయస్వామి, సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో సకల సదుపాయాలు

మందమర్రి రూరల్, జూన్ 11: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో సదుపాయాలు కల్పిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు దత్తు మూర్తి అన్నారు. మంగళవారం పొన్నారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ, పాఠశాల కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య, ఉచిత పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందజేస్తామన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ పిల్లలను బడికి పంపాలని విద్యార్థుల తల్లిదండ్రులను ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో గోగు సుమలత, శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ జిల్లా అధ్యక్షుడు ఈద లింగయ్య, సంపత్, ఉపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సింగరేణి సూపర్ బజార్లలో అన్ని సరుకులు అందించాలి

మందమర్రి, జూన్ 11: సింగరేణి కార్మికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సూపర్ బజార్లలో డీ మార్టులో లభిస్తున్న విధంగా అన్ని సరుకులు అందుబాటులో ఉంచాలని దీని వల్ల కార్మిక కుటుంబాల ప్రజలకు అన్ని సరుకులు ఒకేచోట కొనుగోలు చేసేందుకు వీలుగా ఉంటుందని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జే శ్రీనివాస్ సింగరేణి అధికారులను కోరారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాణ్యమైన వస్తువులను సింగరేణి కార్మికులకు అందించేందుకు ఏర్పాటు చేసిన సూపర్ బజార్లను మూసివేసే ప్రక్రియను ఆపి వాటిని డీ మార్టులుగా అభివృద్ధి చేయాలని కోరారు. ఈ సమావేశంలో హెచ్‌ఎంఎస్ కేంద్ర నాయకుడు వెల్టి సుదర్శన్, ఎర్ర శ్రీనివాస్ రెడ్డి, యాకూబ్, చొప్పరి రామస్వామి, మల్లేశ్, అశోక్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



సంక్షిప్త వార్తలు

హెబ్బే జలపాతంలో పడి హైదరాబాదీ దుర్మరణం

చిక్కమగళూరు (కర్ణాటక), జూన్ 11: కర్ణాటకలోని హెబ్బే జలపాతానికి విహారయాత్రకు వెళ్లిన హైదరాబాద్ యువకుడు ప్రమాదవశాత్తు అందులో పడి మరణించాడు. హైదరాబాద్‌కు చెందిన శ్రవణ్ (25) స్నేహితుడితో కలిసి కర్ణాటకకు విహారయాత్రకు వెళ్లాడు. సోమవారం బైక్‌ను రెంట్‌కు తీసుకొని కెమ్మనగుండి సమీపంలోని హెబ్బే జలపాతం వద్దకు వెళ్లారు. కొన్ని రోజులుగా వానలు పడుతుండంతో జలపాతం వద్ద ప్రవాహం ఉధృతంగా ఉన్నది. ఇద్దరికీ ఈత రానప్పటికీ సెల్ఫీ తీసుకోవడానికి ప్రయత్నిస్తూ కాలుజారి నీటిలో పడిపోయారు. నీటిలో మునిగేంత లోతు లేనప్పటికీ కాలుజారినప్పుడు శ్రవణ్ తల బండరాయికి తగిలింది. తీవ్రంగా గాయపడిన శ్రవణ్‌ను సమీప ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అప్పటికే చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

యెమెన్‌లో బోటు మునక.. 49 మంది మృతి

కైరో, జూన్ 11: యెమెన్ సముద్రతీరంలో వలస కార్మికుల (శరణార్థులు)బోటు ప్రమాదవశాత్తు మునిగిపోయింది. ఈ ప్రమాదంలో 49 మంది చనిపోగా, మరో 140 మంది గల్లంతైనట్టు ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ వలసల సంస్థ మంగళవారం వెల్లడించింది. సోమాలియాలోని ఉత్తర తీరం నుంచి 260 మంది సోమాలిస్, ఇథియోపియన్లను తీసుకొని గల్ఫ్ ఆఫ్ ఎడెన్ మీదుగా బోటు బయలుదేరింది. 320 కిలోమీటర్ల సముద్ర ప్రయాణమార్గంలో బోటు యెమెన్ దక్షిణతీరంలో సోమవారం మునిగిపోయిందని ఆ సంస్థ తెలిపింది. ఇప్పటివరకు 71 మందిని రక్షించినట్టు పేర్కొన్నది.

విమాన ప్రమాదంలో మలావీ ఉపాధ్యక్షుడి మృతి

బ్లాంటైర్ (మలావీ), జూన్ 11: ఆఫ్రికా దేశం మలావీలో విమానం అదృశ్యమైన ఘటన విషాదాంతమైంది. ఆ విమానం పర్వత ప్రాంతంలో కుప్పకూలటంతో అందులో ప్రయాణిస్తున్న మలావీ ఉపాధ్యక్షుడు సహా 10 మంది దుర్మరణం చెందారు. విమాన ప్రమాదంలో ఉపాధ్యక్షుడు సౌలోస్ చిలిమా మృతిచెందారని దేశ అధ్యక్షుడు లజారస్ చక్వేరా మంగళవారం ప్రకటించారు. విమానం గల్లంతైన ప్రదేశాన్ని గుర్తించామని, శకలాల్లో ఎవరూ ప్రాణాలతో లేరని ఆయన వెల్లడించారు.

టిబెట్‌లో 30 ప్రాంతాలకు భారత్ కొత్త పేర్లు

న్యూఢిల్లీ, జూన్ 11: టిబెట్‌లో 30 ప్రాంతాలకు భారత ప్రభుత్వం కొత్త పేర్లను ఖరారు చేసింది. టిబెట్‌లోని 11 నివాస ప్రాంతాలు, 12 పర్వతాలు, 4 నదులు, ఒక సరస్సు, ఒక పర్వత మార్గం, ఓ భూభాగానికి.. పేర్ల మార్పును ఎన్డీయే సర్కార్ మంగళవారం ఆమోదించింది. చారిత్రక పరిశోధన, భారత్‌లో కలిసిపోయిన టిబెట్ అనుబంధ ప్రాంతం ఆధారంగా ఈ పేర్లను మార్చుతున్నట్టు భారత్ తాజాగా పేర్కొన్నది. దీనిని పరిగణనలోకి తీసుకొని భారత సైన్యం త్వరలో సరిహద్దు మ్యాప్‌లను విడుదల చేయనున్నది. అరుణాచల్‌పై చైనా మ్యాప్‌లు విడుదల చేయటానికి దీటుగా భారత్ ఈ చర్యను చేపట్టినట్టు తెలుస్తున్నది.

పెరిగిన షెన్‌జెన్ వీసా ఫీజు

న్యూఢిల్లీ, జూన్ 11: పెరిగిన షెన్‌జెన్ వీసా ఫీజు మంగళవారం నుంచి అమల్లోకి వచ్చింది. ఈ వీసా ద్వారా యూరోపియన్ యూనియన్(ఈయూ)లోని 29పైగా దేశాలకు వీసా లేకుండా ప్రయాణించవచ్చు. తాజా పెంపు ప్రకారం పెద్దలు రూ.7,267-8,175; పిల్లలు రూ.3,633-4,087 ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. యూకే, యూఎస్, ఆస్ట్రేలియా దేశాలు వసూలు చేసే వీసా ఫీజులతో పోలిస్తే తాము పెంచిన వీసా ఫీజులు తక్కువేనని ఈయూ తెలిపింది. షెన్‌జెన్ వీసా ద్వారా ఆరు నెలలలోపు ఒకసారి 90 రోజులపాటు ఈయూ దేశాల్లో బస చేయవచ్చు. ఈ వీసా కేవలం పర్యాటకులకు, కుటుంబ సందర్శనలకు మాత్రమే వర్తిస్తుంది. ఈయూలో ఉద్యోగాలు చేసేవారికి వర్తించదు. ఐర్లాండ్, సైప్రస్ మినహాయించి మిగతా అన్ని ఈయూ సభ్య దేశాల్లో షెన్‌జెన్ వీసా చెల్లుబాటు అవుతుంది. ఈయూలో లేని నార్వే, స్విట్జర్లాండ్, ఐస్‌ల్యాండ్, లిచెన్‌స్టీన్ దేశాల్లో సైతం ఈ వీసాను అనుమతిస్తారు.

అమెరికా నగరాలకు భూకంపాల ముప్పు

న్యూయార్క్, జూన్ 11: అమెరికాలోని ప్రధాన నగరాలకు భారీ భూకంపాల ముప్పు పొంచివుందని తాజా అధ్యయనం హెచ్చరించింది. భూమిపై అత్యంత శక్తివంతమైన భూకంపాలు ఏర్పడుతున్న 'కాస్కాడియా సబ్‌డక్షన్ జోన్' (సీఎస్‌జెడ్)పై పరిశోధన జరిపిన సైంటిస్టులు ఈ విషయాన్ని వెల్లడించారు. 'సీఎస్‌జెడ్'లో వచ్చే భూకంపాలు.. తీర ప్రాంతంలో 100 అడుగుల ఎత్తులో సునామీలు ఏర్పడటానికి దారితీస్తాయి. అమెరికాలోని ఉత్తర కాలిఫోర్నియా నుంచి కెనడాలోని బ్రిటిష్ కొలంబియా వరకు విస్తరించిన భౌగోళిక ప్రాంతాన్ని సైంటిస్టులు 'కాస్కాడియా సబ్‌డక్షన్' (సీఎస్‌జెడ్)గా పేర్కొన్నారు. ఇది ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన భూకంపాలు, సునామీలు సంభవించే ప్రాంతంగా సైంటిస్టులు చెబుతున్నారు.

ఎంఆర్ఐ పరీక్ష ఇక చౌక

- 18 లక్షలకే స్కానింగ్ యంత్రం
- హాంకాంగ్ శాస్త్రవేత్తల అభివృద్ధి
- తగ్గనున్న ఎంఆర్ఐ స్కాన్ ధర

బెంగళూరు, జూన్ 11: హాంకాంగ్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తల బృందం చౌకైన మాగ్నెటిక్ రెసోనెన్స్ ఇమేజింగ్(ఎంఆర్ఐ) యంత్రాన్ని తయారుచేసింది. ఇప్పుడు వినియోగంలో ఉన్న ఎంఆర్ఐ యంత్రాలతో పోలిస్తే దాదాపు 50 రెట్లు తక్కువ ధరకే దీన్ని తయారుచేసే అవకాశం ఉంటుందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ యంత్రం అందుబాటులోకి వస్తే ఎంఆర్ఐ స్కానింగ్ ధర కూడా భారీగా తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం అత్యంత ఖరీదైన వైద్య పరీక్షల్లో ఎంఆర్ఐ స్కానింగ్ ఒకటి. గుండె, మెదడు, ఎముకల సంబంధ సమస్యలను తెలుసుకోవడానికి, క్యాన్సర్లను గుర్తించడానికి వైద్యులు ఎక్కువగా పేషెంట్లకు ఎంఆర్ఐ స్కానింగ్ చేయిస్తారు. ఎంఆర్ఐ చేయించడానికి దాదాపుగా రూ.7 వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చు అవుతుంది. కొన్నిచోట్ల ఇంతకంటే తక్కువ ధరకు చేస్తున్నప్పటికీ ఇందుకోసం వెయిటింగ్ పీరియడ్ ఎక్కువగా ఉంటుంది. ఎంఆర్ఐ పరీక్షకు ఇంత ఎక్కువ ధర ఉండటానికి ప్రధాన కారణం ఈ పరీక్ష చేసే యంత్రం ఖరీదైనది కావడమే. మన దేశంలో 3-టీ ఎంఆర్ఐ మెషీన్ ధర దాదాపుగా రూ.9 కోట్ల నుంచి రూ.13 కోట్ల వరకు ఉంటుంది. దీనికి అవసరమైన సదుపాయాల కోసం మరింత ఖర్చు అవుతుంది. ఇంత భారీ ధర పెట్టి ఎంఆర్ఐ యంత్రం కొనుగోలు చేయడం వల్ల పరీక్షకు సైతం ఎక్కువగా ధర వసూలు చేస్తున్నారు.

ధర తక్కువ.. నిర్వహణ సులభం

ధర ఎక్కువగా ఉండటం వల్ల పేదలు అవసరమైనప్పుడు ఎంఆర్ఐ పరీక్ష చేయించుకోలేకపోతున్నారు. ఈ పరిస్థితిని గుర్తించిన హాంకాంగ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఈ కొత్త ఎంఆర్ఐ యంత్రాన్ని తయారుచేశారు. దీని ధర దాదాపు 22 వేల డాలర్లు ఉంటుంది. భారతీయ కరెన్సీలో ఇది రూ.18.4 లక్షలు. తక్కువ సామర్థ్యం గల 0.05 టెస్లా(టీ) అయస్కాంతాలతో ఈ కొత్త ఎంఆర్ఐ యంత్రాన్ని తయారుచేశారు. సాధారణ ఎంఆర్ఐ యంత్రాన్ని ప్రత్యేక రక్షణ కలిగిన గదిలో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇందులోని అయస్కాంతాలను చల్లబరిచేందుకు లిక్విడ్ హీలియం వాడతారు. దీనికి విద్యుత్తు సదుపాయం కూడా వేరుగా ఇవ్వాల్సి ఉంటుంది. ఈ కొత్త ఎంఆర్ఐ యంత్రాన్ని మాత్రం సాధారణ గదిలోనే ఏర్పాటు చేయవచ్చని, దీనికి హీలియం కూలెంట్ అవసరం లేదని, మామూలు విద్యుత్తు ఔట్‌లెట్‌తోనే వినియోగించవచ్చని శాస్త్రవేత్త డాక్టర్ ఎడ్‌వూ తెలిపారు. దీని ధర తక్కువ అని, నిర్వహణ సులభమని, విద్యుత్తు వినియోగం కూడా తక్కువేనని తెలిపారు. అయితే, 3టీ ఎంఆర్ఐ యంత్రంతో పోలిస్తే ఈ 0.05టీ ఎంఆర్‌టీ యంత్రంలో ఇమేజ్ నాణ్యత తక్కువగా ఉంటుందని పలువురు వైద్యులు అభిప్రాయపడుతున్నారు. దీనికి పరిష్కారంగా ఏఐని వినియోగిస్తున్నామని, ఏఐ ద్వారా ఇమేజ్ నాణ్యతను పెంచొచ్చని ఎడ్‌వూ చెప్తున్నారు.

కన్నడ నటుడు దర్శన్ అరెస్ట్

- హత్య కేసులో అదుపులోకి
- నటి పవిత్ర గౌడ కూడా అరెస్ట్
- పవిత్రపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని హత్య చేసినట్టు ఆరోపణలు

బెంగళూరు, జూన్ 11: ప్రముఖ కన్నడ నటుడు దర్శన్ తూగుదీప ఓ హత్య కేసులో అరెస్ట్ అయ్యారు. తన సహచర నటి పవిత్ర గౌడపై అనుచిత వ్యాఖ్యలు చేశాడన్న కోపంతో రేణుకాస్వామి అనే వ్యక్తిని హత్య చేశాడన్న ఆరోపణలపై ఛాలెంజింగ్ స్టార్‌గా పేరొందిన దర్శన్‌ను మంగళవారం పోలీసులు మైసూరులోని ఒక హోటల్‌లో అరెస్ట్ చేశారు. ఈ కేసులో నటి పవిత్రతోపాటు మరో 11 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని బెంగళూరు మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా ఆరు రోజుల పోలీస్ కస్టడీ విధించారు. ఒక ఫార్మా కంపెనీలో పనిచేస్తున్న రేణుకాస్వామి.. సామాజిక మాధ్యమంలో నటి పవిత్రా గౌడపై అవమానకర రీతిలో వ్యాఖ్యలు చేయడంతో అతడిని హత్య చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

హత్య చేసి.. మురికి కాల్వలో పడేసి..

ఈ నెల 9న స్వామి మృతదేహం దొరికింది. కామాక్షి పాలస్య పోలీస్ స్టేషన్ పరిధిలోని పత్తంగెర్‌లోని ఒక షెడ్‌లో రేణుకాస్వామిని హత్య చేసి, మృతదేహాన్ని ఒక మురికి నీటి డ్రెయిన్‌లో పడేశారు. పోలీసులు సీసీ టీవీ ఫుటేజ్, ఇతర సాంకేతిక ఆధారాలతో అనుమానితులు 11 మందిని అరెస్ట్ చేశారు. వారి స్టేట్‌మెంట్‌లు ఆధారంగా దర్శన్, పవిత్రలను మంగళవారం అరెస్ట్ చేశారు. ఈ హత్యలో దర్శన్ నేరుగా పాల్గొన్నారా? లేక హత్య కుట్రలో భాగస్వామిగా ఉన్నారా? అన్నది దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కరియా, క్రాంతివీర, సంగొల్లి రాయన్న, నవగ్రహ, సారథి, మెజిస్టిక్, బుల్‌బుల్ వంటి విజయవంతమైన చిత్రాల్లో దర్శన్ నటించారు. అరెస్టు నేపథ్యంలో దర్శన్ ఇంటి వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అక్రమ తుపాకీ కేసులో బైడెన్ కుమారుడు దోషి

దేశాధ్యక్షుడి కొడుక్కి శిక్ష పడటం ఇదే తొలిసారి

న్యూయార్క్, జూన్ 11: అక్రమంగా తుపాకీని కలిగి ఉన్నాడన్న ఆరోపణలకు సంబంధించిన మూడు కేసుల్లో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కుమారుడు హంటర్ బైడెన్‌ను న్యాయస్థానం దోషిగా నిర్ధారించింది. అయితే అతనికి విధించే శిక్షను ఇంకా ప్రకటించ లేదు. సాధారణంగా దోషిగా నిర్ధారించిన 120 రోజుల్లో నిందితుడికి శిక్ష విధిస్తారు. కాగా, ఒక దేశ అధ్యక్షుడి కుమారుడికి కేసులో శిక్ష పడటం అమెరికా చరిత్రలో ఇదే ప్రథమం. మారణాయుధం కొనేటప్పుడు తన దగ్గర ఉన్న మాదకద్రవ్యం గురించి అబద్ధం చెప్పాడని హంటర్ బైడెన్‌పై మొదటి అభియోగం. ఈ కేసులో అతడు 10 ఏండ్ల పాటు శిక్షను ఎదుర్కొనే అవకాశం ఉంది. అలాగే రెండో కేసులో ఐదేండ్లు, మూడో కేసులో మరో పదేండ్లు శిక్ష పడవచ్చు. అయితే న్యాయస్థానం ఇచ్చే ఏ తీర్పునైనా అంగీకరిస్తానని, న్యాయవ్యవస్థను గౌరవిస్తానని జో బైడెన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

SUPER HIT.. నేడే చూడండి

AMB ఎఎంబి - గచ్చిబౌలి 10.55 AM	పెన్ష